# నిద్రాళువు

శ్రీ పురాణం సూర్యప్రకాశరావు

* గత సంచిక తరువాయి

## 7

ఇంకా పూర్తిగా శీతాకాలం వెనకబట్టకుండానే ఎండలు ముదరనారంభించాయి. రాత్రి చలి ఎముకలు కొరికేస్తున్నా పగలు ఎండలు నిలిచి మండుతున్నాయి. గాలికూడా రానురాను వెచ్చబడసాగింది.

ప్రకృతిలో ఈ విపరీతానికి కారణం వీరభద్రం గారు ఇవాళ సాయంత్రం ఆరు గంటలకే ఇంటికి రావటం. ఆయన ఒక చంకలో పెద్ద పొట్లం, రెండో చంకలో పెద్ద సంచీ, రెండు చేతుల్లోనూ రబ్బరు బెలూన్లు, గాలిపటాలు, ఇత్యాది చిల్లర ఆటవస్తువులతో రథంలాగ ఇంట్లో ప్రవేశించగానే చంద్రుడు ముందు ఆయన కాళ్ళావేళ్ళాపడి ఆయన్ని అడుగు ముందుకు వెయ్యనియ్యలేదు. అనూరాధ గదిలోనుంచి ఇవతలికి వచ్చింది. నారాయణి చేతిలో గరిటతో సహా గుమ్మంలోనే నిలబడిపోయింది. భర్త ఇవాళ ఇంత పెందరాళే ఇంటికి రావటం అన్నది ఆమెకి వంటినిండా నగలు తొడుక్కున్నంత సంబరంగా వుంది. ఆ సంతృప్తి ముఖంమీద వ్యక్తం అవుతూనే వుంది.

ఆయన చంద్రుడ్ని చాపమీద కూర్చోబెట్టుకుని తెచ్చినవస్తువులన్నీ ఒక్కటొక్కటే వాడి చేతిలో పెడుతూ వాడిని ఆడిస్తూ తన్మయులైపోయారు. "అనూ! నీకు మంచి చీరా, రవికలగుడ్డా తెచ్చాను చూడు. చంద్రుడికి మంచిలాగూ చొక్కా తెచ్చాను" అన్నారాయన.

"మరి నాకేమిటీ పట్టుకురాలే దేమిటి?" అంది నారాయణి మడికట్టుకున్నందువల్ల దగ్గరికి రాకుండా దూరంగా నిలబడే.

"నీకూ నాకూ ఇంకా సరదాలేమిటి. పెద్దవాళ్లమయిపోతున్నాం."

"అవునులెండి. మీ మాటెల్లాగున్నా నేను ముసలమ్మనైపోతున్నాను."

"ఉత్తినే అన్నారే. నీకూ తెచ్చారు" అంది అనూరాధ రెండు చీరలూ విడివిడిగా చాపమీద పరుస్తూను.

చంద్రుడు వాడి చొక్కా లాగూ తీసుకుని గదిలోకి పరుగెత్తాడు.

"నలభైరూపాయిలయాయి. మా స్నేహితుడు కొంటుంటే నేనూ కొనేశాను. ఏం? బాగున్నాయా బట్టలు?"

నారాయణి మనసులోనే కొంత బాధపడింది. నిన్ననే పెళ్ళిచూపులకంటూ అమ్మాయికి చీర తెచ్చారు. మళ్ళీ ఇవాళ ఎందుకు తీసుకొచ్చినట్టు? అని మనసులోనే అనుకుంది. వీరభద్రంగారు ప్రతినెలా ఇలా ఏదో ఒకవిధంగా ఖర్చుచేస్తూనే వుంటారు.

"అమ్మాయికీ, అబ్బాయికీ తెచ్చారు. చాలదూ? నాకుకూడా దేనికి?" అంది నారాయణి.

"అదేమిటే అలాగంటావు. ఇప్పుడేగా 'నాకు తెచ్చారా?' అని అడిగావు. ఇప్పుడలాగంటావేం?"

"ఊరికే అన్నాను. నాకు బోలెడన్ని చీరలున్నాయి. రోజుకో చీరచొప్పున కట్టినా తరిగేట్టు లేవు" అంటూ ఆమె లోపల వంటపని చూసుకుందుకు వెళ్ళిపోయింది. ఇంతవరకూ ఆమెమనసులో అడగాలనుకుంటున్న విషయం అడగలేకపోయింది. ఆయనంతటఆయన ఎత్తరు. తను అడుగుతే విసుక్కుంటారేమోనని భయం. చివరికామె ధైర్యంచేసి ఇవతలికి వచ్చి "అలా వెళ్లి కనుక్కొచ్చారా?" అంది.

ఆయన ముఖం పైకెత్తి 'అలా అంటే ఎలా? ఎక్కడికి?' అన్నారు.

"అదేనండీ. నిన్న పిల్లని చూట్టానికి వచ్చినవాళ్ళ దగ్గరికి."

"వెళ్లలేదు."

"ఇప్పుడోమారు వెళ్లిరారాదూ."

ఆయన చేతిలో రబ్బరుబంతి చిరాగ్గా విసిరి వీథిలోకి నడిచారు.

నారాయణి నిట్టూరుస్తూ లోపలికి వెళ్లిపోయింది. అనూరాధ తలవంచుకునే ఎన్నడూ ఊహించనివిధంగా ఈ ఇంట్లో తనొక సమస్యగా పరిణమించటం అన్నది గ్రహించి ఆ ఆలోచనలతో తల పాడుచేసుకుంటూంది.

తిరిగి ఆయన వచ్చేలోపున నారాయణి లక్షుమార్లు పూజావిగ్రహానికి మొక్కింది. కాని దేముడు ఆమెకు అనుకూలించలేదు. ఆయన తీసుకువచ్చినవార్త ఆమెను చాలా కృంగదీసింది. కాని అనూరాధ మనసు తెరిపిన పడినట్టుగా తేలికపడింది.

"వాళ్లకి పిల్ల నచ్చలేదుట" అన్నారాయన.

నారాయణి ఆ కోపాన్నంతా అనూరాధమీద వెళ్లగక్కింది. "నేననుకుంటూనే వున్నాను. వాళ్ళు అడిగిందానికి నోరుమెదిపి సమాధానం చెబితేనా? పిల్ల నచ్చలేదని వారన్నారంటే స్వభావం గురించి వాళ్లు అపోహపడ్డారు. అంతే జరిగింది. అయినా పెద్దవాళ్లు చెప్పటం చిన్నవాళ్లు వినటం, అన్నది మా కాలంలో ఎరుగుదుంగాని ఈ పెంకితనాలు ఎరగం. వెనకనించి ఎంత చెప్పినా సనేమీ విననుగాక విననంటే ఇంకేం చేసేది? నిక్షేపంలాంటి సంబంధం చేసేతులా పాడు చేసుకున్నాం. అయినా అమ్మాయ్ నువ్విలాగుంటే ఈజన్మలో నీకు పెళ్ళికాదు. నే చెబుతున్నా ఏమనుకున్నావో. నీకు రూపం తక్కువనా వాళ్ళునచ్చదంట. లక్ష్మిలాంటి పిల్లవు రూపంలో వంక పెట్టగలరా? నీ పెంకితనం చూసి వాళ్ళు వదులుకున్నారు." అని నారాయణి విసురుగా అక్కడ్నించి కదిలి పెరటిలోకి వెళ్ళిపోయింది.

అనూరాధ మనసు చిన్నబుచ్చుకుని వీథి వరండాలోకి నడిచి అక్కడ కూర్చుని పార్వతమ్మ ఒకప్పుడు అన్నమాటలను స్ఫురణకు తెచ్చుకుని వాటిని తనకి అన్వయించుకుంటూ, ఆమెస్మృతి రేకెత్తించిన దిగులుతో మనసంతా నీరుచేసుకుంది.

చీకటి అలుముకుంటోంది. "అలా కూర్చోక పోతే కాస్త దీపం వెలిగించకూడదూ. అదికూడా ఒకళ్ళు చెప్పాలన్నమాట" అంది నారాయణి.

అనూరాధ లేచి ఆపనిలో నిమగ్నురాలైందిం వీరభద్రంగారు గదిలోంచి "దీపం ఇంకా వెలిగించలేదూ?" అంటూ కేకేసారు.

అనూరాధ చేతిలో దీపంతో లోపలకి ప్రవేశించగానే "పోనీలేవే అమ్మాయ్! దీని తలదన్నిన సంబంధం తీసుకొస్తాను. ఇది పోతేపోయిందిలే." అన్నారాయన ఓదారుస్తున్నట్టుగా.

"లేకపోతే నాకిదే దిగులనుకున్నారేవిఁటి?" అంది అనూరాధ.

"అవును నీ కెందుకుంటుందే దిగులు, పడేవాళ్ళం మాకుంటుంది బాధ!" అంటూ నారాయణి అరిచింది గదిలోనుంచి.

"నువ్వూరుకో అమ్మా. నస్నేం చెయ్యమంటావు. వాళ్ళు పిల్ల నచ్చలేదంటే మధ్యని నన్ను తిడతావు దేనికి? నేనొక త్తెను తేరగా దొరికాను నీకు" అని అనూరాధ సమాధానం ఇచ్చింది. అనూరాధ మాట పూర్తి కాగానే వీరభద్రంగారు కూతురు తరపున వకాల్తా పుచ్చుకుని "అవునే దాన్ని పట్టుకుని సతాయిస్తావు దేనికి. నీకేమైనా మతిపోయిందేవిఁటి? వాళ్ళకి పొగరెక్కి నోటికేది తోస్తే అది వాగుతే అది పుచ్చుకుని దానిమీద ఎగురుతావేవిటి? ఇంక వూరుకో. ఆకలేస్తోంది. ముందు వంట ప్రయత్నం చూడు. ఆ తర్వాత నీ తెలివి చూపిద్దువుగాని" అని కూతురు ముఖంలోకి చూసి "చాలా! ఇంకా కేకలెట్టమంటావా?" అన్నట్టుగా సాభిప్రాయంగా చూసారు.

నారాయణి గొంతు ఇక వినిపించలేదు. భర్త జోక్యంతో ఆమె పూర్తిగా చల్లారి పోయింది.

ఇవాళ ఒకళ్ళిద్దరు ఆడవాళ్ళు వచ్చారుగాని నారాయణి భర్త ఇంట్లోనే వున్నాడని తెలవగానే వాళ్ళు వెళ్ళిపోయారు. ఆ వచ్చినవారిలో ఒకామె అనూరాధకి తగిన వరుడంటూ ఒక సంబంధం గురించి చెప్పింది. వాళ్ళకీ ఏవో సంబంధాలు వస్తున్నాయిట. త్వరపడకపోతే చెయ్యిజారిపోతుందంటూ ఆమె పదే పదే హెచ్చరించింది. నారాయణి ఆ సంబంధం గురించి ఆమె చెప్పిన వివరాలన్నీ శ్రద్ధగా విని మనసులో పెట్టుకుని భోజనందగ్గర భర్తతో చెప్పింది.

ఆయన "అలాగే చూద్దాం. మీ అన్నయ్యను రమ్మనమని రాయి" అన్నారు.

"వాడెందుకు?"

"కాస్త వాళ్ళని తీసుకురావటానికి దానికీ..."

"తడవతడవకీ వాడెలా వస్తాడండీ. మనమే చూసుకోవాలిగాని. ఓమారు తీరిక చేసుకుని వెళ్లిరండి. ఈవూరేగా. రేపు వెళ్ళండి."

"సరే చూద్దాంలే"

మర్నాడు వాళ్ళు పిల్లని చూట్టానికి వచ్చారు. పిల్ల నచ్చిందనే అభిప్రాయం వాళ్లు వ్యక్తంచేసారు. అయితే కట్నకానుకల విషయం వచ్చేసరికి నారాయణి గుండెలు అవిసిపోయాయి. వీరభద్రంగారి ముఖం వెలవెలబోతూ భార్యవైపు తిరిగింది. ఆమె ధైర్యంచేసి ముందుకువచ్చి "అదే ఆఖరి మాటంటారా? మా మాట కాస్త వినేదిలేదా?" అంది ప్రాధేయపూర్వకంగా.

"అయిదువేలకి తక్కువయితే ఒప్పుకునేది లేదండీ" అని ఖచ్చితంగా చెప్పేశాడు పిల్లవాడి తండ్రి.

నారాయణి మరోమార్గం చెప్పిచూసింది. "మూడు వేలవరకూ మేం భరించగలం. తతిమ్మా లాంఛనాలన్నీ జరుపుతాం. ఇక అంతకుమించి తూగటం మా అంతస్తుకు మించినపని. మీరు కాస్త దయదలచి..." భార్య ఇలా దీనంగా వేడుకోవటం వీరభద్రంగారికి మహా చిన్నతనంగావుంది. అనూరాధ ఏకంగా కన్నీరే కార్చింది.

"మా అంతస్థుకి మేము చాలా తగ్గించే చెప్పాం. పిల్లవాడుకూడా తక్కువేమీ చదవలేదు. బి. ఏ. చదివాడు. అపాటి కట్నం ఇవ్వటం అన్నది ఆలోచించవలసిన విషయంకాదు" అన్నారాయన.

నారాయణి నిస్పృహగా "ఇక అంతేనంటారా?" అంది.

ఆయన చిరాకు వ్యక్త్యంఅయే స్వరంతో "పదిమాటలెందుకు. అంతకు దమ్మిడీ తగ్గేదిలేదు. ఇక పైగా పట్టు తాపితాలు, వెండికంచం, చెంబూ, ఆడబడుచు లాంఛనాలూ ఇత్యాది చిల్లర లాంఛనాలన్నీ మీరు వేరుగా జరపాల్సిందే. ఏమంటారు? మేం మళ్లీ వెళ్ళిపోవాలి" అన్నారు అదే ఆఖరి మాటగా.

నారాయణి "మా పరిస్థితి కాస్త అర్థంచేసుకుని..."

"అయితేపదండి. ఇక ఇది తేలేవ్యవహారంకాదు వస్తాం" అంటూ,ఆ పెళ్ళివారు వెళ్ళిపోయారు.

నారాయణి హతాశురాలై అనూరాధని హృదయానికి హత్తుకొని తలుపువార కూర్చుండిపోయింది.

## 8

తరుచుగా అనూరాధ మనోరమ ఇంటికి వెళ్లటం, సరదాగా కాసేపు ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకోవటంతో తన అమ్మమ్మ లేనిలోటు భర్తీచేసుకోగలిగింది. ప్రపంచంలో నిత్యం జరిగే అనేక వింత వింత విషయాల నెన్నిటినో మనోరమ అనూరాధ చెవిని వేస్తూంటుంది. ఆ విచిత్రాల గురించి తను వ్యాఖ్యానిస్తూంటుంది కూడాను.

కాని ఈ పరిచయం ఇలా వృద్ధి కాకుండా అర్థాంతరంగా తెగిపోయే విషమ పరిస్థితులు వచ్చిపడ్డాయి. నారాయణిచెవిలో లేనిపోని అభూత కల్పనలు ఎవరు వూదారో తెలియదు కాని అనూరాధ ఆ మాటలు విని సహించలేకపోయింది. వచ్చిన అమ్మలక్కలలో ఒకామె అడిగిన ప్రశ్నకు నారాయణి ముఖమంతా చెండుకుని గొంతుచించుకుని "కట్టుకున్నవాణ్ణి వదిలిపెట్టి దేశాలమీదపడి చదువులు వెలగబెట్టే వారి యింట్లో నా పిల్లను చస్తే పడెయ్యను. అంత ప్రాలబ్ధం మాకేవీ పట్టలేదు. అయినా రోజూ పిల్లని ఇంటికి రమ్మనటంలోవుద్దేశం ఇదన్నమాట! నా ముఖం మండ! అంత దూరం నేను ఆలోచించనే లేదు. మనుష్యుల్లో ఇంత కుచ్చితాలు వుంటాయని నేననుకోలేదు. అవునులే కట్టుకున్నవాణ్ణి కన్నవాణ్ణి వదులుకుని హాయిగా తిరిగే ఆడదానికి ఆపాటి కుతంత్రాలు తెలియవూ? డబ్బు లేకపోయినా మటుకు, మర్యాదావున్న వంశంలోగాని నా కూతుర్ని అడుగు పెట్టనివ్వను, దానికేం లక్ష్మిలాంటి పిల్ల. దీని సాహసం మండ! ఎంత బరితెగించింది" అంటూ నారాయణి నోరు ఒక హద్దూ పద్దూ లేకుండా సాగిపోయింది.

అనూరాధ రెండు చెవులూ మూసుకుని ఆ మాటలు వినబడనంత దూరం పెరటిలోకి వెళ్ళిపోయింది. నిష్కారణంగా ఒకవ్యక్తి గురించి ఇలాంటి అభియోగం తేవటం ఆమె సహించలేకపోయింది. తను మనోరమ ఇంటికి వెళ్ళటంలో ఎలాంటి వుద్దేశాలు ఎవరికీ లేవు. కానీ ఇప్పు డీతల్లి అన్నమాటలు

మనోరమకు తెలుస్తే ఎంత బాధపడుతుందో! ఆమెకీవిషయాలు తప్పకుండా తెలుస్తాయి. ఇక ఆమె ముఖం తనెలా చూడగలదు? ఇంతటి నింద భరించి మనోరమ తన్ని క్షమిస్తుందా?

వాళ్ళంతా వెళ్ళిపోయింతర్వాత నారాయణి "అనూరాధా" అని పిలిచింది కఠినంగా. అనూరాధ భయపడుతూనే ఆమె ముందుకు వచ్చి నిలబడింది.

"రేపట్నించి అక్కడికి వెళ్లటం మానెయ్యి"

"ఎందుకని?"

"అది నీకనవసరం. నేను మానమంటున్నాను. మానెయ్యి"

అనూరాధ పరుషంగా "అదే ఎందుకు మానాలి? అంటున్నాను" అంది.

"ఎందుకో నే చెప్పాలన్నమాట. నీకు తెలియదా?"

"తెలియదు."

"ఆ టక్కులాడి మనోరమ ఆవిడగారి తమ్ముణ్ణి ఈ ఇంటి అల్లుడ్ని చెయ్యాలని చూస్తోంది."

"అదంతా అబద్ధం. ఎవరో గిట్టనివాళ్లు లేనిపోనివన్నీ నీ చెవిని వేసారు. మనోరమకి అలాంటి వుద్దేశాలు వుండవు. ఆమె అలాంటి మనిషి కాదు."

"కాదు పాపం! నక్క పుట్టి నాలుగు వారాలు కాలేదుగాని నా జన్మలో ఇంత గాలివాన ఎరగనందిట. అలాగుంది నీ మాట. ప్రపంచమంటే నీకేం అనుభవం వుందే? పరువూ మర్యాదా వున్నవాళ్ళెవరూ ఆ అబ్బాయికి పిల్లనిస్తారని నేననుకోను. రెండు వందలు కాదు మూడు వేలు జీతం తెచ్చుకోనీ ఒక గుట్టులేని ఆడదాని తమ్ముడనే అపవాదు అతడు జన్మలో మాపుకోలేడు. అంతవరకూ నే చెప్పగలను."

"అసలు ఏమీలేనిదే కేవలం గాలి మాటలు పట్టుకుని ఇంత రాద్ధాంతం చెయ్యటం బాగులేదమ్మా. వాళ్ళు అలాంటివాళ్ళు కారు."

"వాళ్ళెలాంటివాళ్లో నీకంటె నాకు బాగా తెలుసు. నువ్వు నోరు మూసుకుని చెప్పినట్టు విను."

ఇలాంటి తల్లితో వాదించటం తన నీడతో తను కుస్తీ పట్టటంలాంటిదని అనూరాధ ఇక వాదన పెంచకుండా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

ఆ తర్వాత నారాయణి ఏదో సణుగుతూనే వుంది చాలాసేపు. ఆమె కొన్ని ముఖ్య విషయాల్లో ఎంత స్తబ్ధుగా, నిర్లిప్తతగా వుంటుందో, కేవలం అర్థం లేని చిల్లర విషయాలపట్ల అంతటి తీవ్రవైఖరి అవలంబిస్తుంది,

సరిగ్గా ఈ సంఘటన జరిగిన వారంరోజులకి దేవాలయం దగ్గర అనూరాధకి మనోరమ తటస్థపడటం జరిగింది. ఆమె ఎదటపడగానే అనూరాధ నిలువంతా జలదరించినట్టయింది. గుండె గతుక్కుమంది. తలయెత్తి పలకరించటానికి ముఖం చెల్లలేదు.

మనోరమ ఆమె బుజంమీద చేతులు వేసి "మా యింటికి రావటం బొత్తిగా మానేసావెందుకని?" అని పలకరించింది.

ఏమని సమాధానం చెప్పాలో అనూరాధకి పాలుపోలేదు. తలవంచుకునే ఆమె బొటనవ్రేలితో నేల మీద గీతలు వేస్తూ "నీకు తెలియదా మనోరమా?" అంది.

"అదంతా విన్నాను. కాని అందుకని నువ్వు నన్ను అపార్థం చేసుకున్నావా" అంది మనోరమ.

"లేదు. లేదు. నిన్నెప్పుడూ అపార్థం చేసుకోను. నీ సంగతి నాకు బాగా తెలుసు. నాకే ముఖం చెల్లక..."

నువ్వు చేసిందేముంది? పెద్దవాళ్ళు ఏదో తొందరపడితే దానికోసం నే నదే మనసులో పెట్టుకున్నాననుకున్నావా? ఇలాంటి అభియోగాలను ఎన్నిటిని భరించి ఇలా తిరుగుతున్నానో నీకు తెలియదు. అవన్నీ ఇలా విని అలా వదిలేస్తూంటాను. ఇందుకోసం నువ్వు మా యింటికి రావటం మానొద్దు."

"వద్దు మనోరమా. ఇలాగే వుందాం. మళ్ళీ నేను నీదగ్గరకు వస్తున్నానని తెలిస్తే ఇంకా గొడవలు పెరుగుతాయి."

"మన మనసులు నిర్మలంగా ఉండాలిగాని ఇలాంటివి మన్నేమీ చెయ్యలేవు. వస్తాను. తమ్ముడికి రెండురోజుల నించీ వంట్లో బాగుండలేదు. ఒక్కడూ వుంటాడు."

"ఎందుకని?" అని అడగకుండా వుండలేకపోయింది అనూరాధ.

"జ్వరం వస్తోంది. ఇవాళ కాస్తతగ్గింది."

"నా మనసుకూడా ఏమీ తెరిపిగాలేదు మనోరమా. పుట్టి బుద్ధెరిగింతర్వాత ఇలాంటి అనుభవాలని ఎదుర్కోవటం ఇదే మొదలు. మనసంతా గుబులు గుబులుగా వుంటోంది. అంతా గజిబిజిగా వుంది" అంది అనూరాధ దృష్టి నేలమీదకు మళ్లించి.

"అవును. విన్నాను. కట్నాలదగ్గర పేచీవచ్చి వాళ్ళు వదులుకున్నారటగా. మరో సంబంధం ఏదైనా చూస్తున్నారా?"

"ఏదో చూస్తున్నారు. కాని ఎక్కడా కలిసి రావటం లేదు."

"అదే కుదురుతుంది. నువ్వు మటుకు మనసు పాడుచేసుకోకు."

"వచ్చిన ప్రతివాళ్లిముందూ వెళ్ళి కూచుని వాళ్లు వేసే ప్రశ్నలకి సమాధానాలు చెప్పేటప్పటికి నాకు ఏడుపువచ్చినంత పనవుతోంది. అదంతా చాలా అవమానకరంగా కూడా వుంది. నాకు చచ్చేఅభిమానం వేస్తోంది."

"ఆడవాళ్ళు జీవితంలో ఎన్నో అవమానాలనూ, అనాదరణలను అగౌరవాన్ని తట్టుకోవాల్సి వుంటుంది. అందుకు ఇప్పట్నుంచీ శిక్షణ అవసరం. అందుకని మన సమాజం ఇలాంటి ఆచారాలని నిలబెట్టుకొంటోంది."

"అయితే దీనికి విరుగుడు లేదంటావా?"

"ఏమీ లేదు. గప్ చిప్ గా పడివుండటం. లేదంటే ఫలితం నీకు తెలుసు. మా అమ్మ నన్నుగురించి అన్న మాటలు నువ్వు విన్నావుగా. అంతే అవుతుంది."

ఈ మనోరమ మాటల్లో అమ్మమ్మ హృదయం ధ్వనిస్తుంది. ఒకప్పుడు అమ్మమ్మ అన్నమాటలు అనూరాధకు స్ఫురణకు వచ్చాయి. తన స్నేహితురాలి పెళ్ళిప్రస్తావన వచ్చినప్పుడు "మొగవాడంటూ ఒకడు తన మెళ్ళో పుస్తెకడితేచాలు" అనేస్థితికి తాను వచ్చానని అమ్మమ్మ అంది. ఆమాటల్ని తనతో అన్వయించుకుని తన పరిస్థితి అందుకు ఏవిధంగానూ భిన్నంగా లేదు అని అనుకుంది అనూరాధ...

మనోరమ ఆప్యాయంగా ఓమారు అనూరాధ శిరస్సు తడిమి వెళ్ళిపోయింతర్వాత గుడిమండపంలో కూచుని అనూరాధ తల్లి రాకకు ఎదురు చూడసాగింది. బాగా చీకటిపడింతర్వాత చేతిలో కొబ్బరికాయలు, పసుపు కుంకుమతోవున్న పళ్ళెంతో దేవాలయానికి వచ్చింది. దేవాలయంలో పూజాపురస్కారాలు ముగిసేసరికి గంట తక్కువ పట్టలేదు. ఇదంతా అనూరాధ వివాహంకోసం పడే తాపత్రయంలో ఒకభాగం అన్నమాట. ఎరిగున్నవాళ్ళు ఇద్దరు తటస్థపడితే వారితో కబుర్లలోకి దిగింది నారాయణి.

అనూరాధ తమ్ముణ్ణి దగ్గరకు తీసుకుని కొంచెం అవతలగా కూచుంది. దేవాలయమంతా అధునాతనమైన అలంకరణలతో కళకళలాడుతోంది. విద్యుద్దీపాలు అమర్చబడ్డాయి. పంపులుకూడా ఏర్పాటు చేసారు. భక్తులకు ఇబ్బందిలేకుండా ప్రతివారికి భగవద్దర్శనం అయేందుకు వీలుగా ఒక మనిషిమాత్రమే ముందుకు వెళ్ళగలిగేట్టుగా దారికట్టారు. తొక్కిసలాటకు అవకాశం లేకుండా.

నిరంతరంగా మ్రోగే గుడిగంటలతో, భక్తుల స్తోత్రపాఠాలతో, హరిభజనలతో ఆలయం కోలాహలంగా, తొడతొక్కిడిగా వుంది.

ఇంతలో రొప్పుకుంటూ కొంపలు మునిగిపోయినట్టుగా నారాయణిస్నేహబృందంలో సభ్యురాలైన వనజమ్మ నారాయణిని సమీపించి "ఇది విన్నావా పిన్నీ" అంది.

"ఏమిటది?"

"మనోరమ నిన్నుగురించి అన్నమాటలు."

"నాకు తెలియదే"

"సరి! సరి! వెంకాయమ్మ నాకు చెప్పింది. ఆనాడు నువ్వన్నమాటలు ఆవిడచెవిని ఎవరు వూదారో నిన్నుగురించి ఎన్నికూతలుకూసిందనుకున్నావు. రామ! రామ! ఈ దేవాలయంలో అలాంటిమాటలు చెప్పలేను" అని వనజమ్మ చెవులు మూసుకుంది.

"ఏమంది?" అని ఆతృతగా ముందుకు జరిగింది నారాయణి.

"తన తమ్ముడికి ఇంతకంటె లక్షరెట్లు యెక్కువయిన సంబంధాలు వస్తాయిట. వేలకివేలు గుమ్మరించేవారు వస్తారుట. తమ అంతస్థుకి నువ్వు ఏవిధంగానూ తగినదానివి కావుట. ఇంకా చాలా అంది నారాయణీ! ఆ మాటలు నే చెప్పలేను. నువ్వు వినలేవు."

"చెప్పు! చెప్పు!" అంటూ రొక్కించింది నారాయణి. ఈమె చెప్పే ప్రతిమాటకీ క్రమక్రమంగా ఆమె ఉద్రిక్తురాలు కాసాగింది.

ఇది గమనించి అనూరాధ "నీ కెవరు చెప్పారమ్మా ఇవన్నీను" అంది.

వనజమ్మ "నాకు వెంకాయమ్మ చెప్పింది" అంది.

"అయితే ఆమెని అడుగుదామా?" అంది అనూరాధ.

"ఆమె ఇక్కడెక్కడుంది?"

"ఇక్కడేవుంది. శివాలయం ముందు చూసాను. ఆమెను పిలుచుకురానా?"

వనజమ్మ జంకకుండా "పిలుచుకురా! నేనేవీఁ అబద్ధం ఆడేదాన్ని కాను. ఇందులో ప్రతిముక్కా ఆ మనోరమ నోటినించి వచ్చినవే. అందులో సందేహం లేదు" అంది.

వెంకాయమ్మ వచ్చి "నాకు కామేశ్వరి చెప్పింది" అంది.

"ఇది విన్నావా అమ్మా. ఇలా లేనిపోని గాలి మాటలన్నీ పోగేసుకుని అనవసరంగా ఒక మనిషిని అల్లరి చెయ్యటానికి మనం తెగబడకూడదు. వీళ్లకి పనీ పాటా లేదు. వాళ్ళకీ, వీళ్ళకీ లేనిపోని మాటలు చెప్పి తగూలు, తంపులూ తీసుకురావటమే వీళ్లపని. పద పోదాం." అంది అనూరాధ తీవ్రంగా.

వనజమ్మ పాలిపోయిన ముఖంతో నారాయణి వైపుచూసి "విన్నావా అమ్మా ఈ చిన్నదాని మాటలు! మేమూ గౌరవం, సభ్యత తెలిసినవాళ్లమే. అల్లరి చిల్లరవాళ్లం కాము. తగూలు పెట్టటానికి మేం మర్యాదలేనివాళ్లం కాదు. నీ కూతురన్న మాటలు ఏవీఁ బాగాలేవు నారాయణి. నీమీద అభిమానంకొద్దీ నిన్నెవరన్నా ఏమన్నా అంటే నా మనసు బాధపడుతుంది గనక చెప్పాను." అంది ఆమె కొరకొర అనూరాధ వైపు చూస్తూను.

అనూరాధ ఏదో చెప్పబోతుండగానే "ఏవే నీకేమైనా పొగరేవిఁటి? అనే మాటా అనకూడనిమాట తెలుసుకోవద్దూ? నోటికి ఎంత మాటవస్తే అంతా అనెయ్యటమే? నిప్పులేందే పొగపుట్టదు. మనోరమ ఎవరితోనూ అనకపోతే నా దగ్గరికి వచ్చి చెప్పటానికి వీళ్ళకేం పట్టింది. అందువల్ల వీళ్లకి ఒరిగేదేముంది? మనోరమ అలా అనదని నువ్వనుకుంటున్నావు కాబోలు! ఆవిడేమీ తక్కువదికాదు. ఎంతకైనా తెగించిన ఆడది. ఆఁ! ఇంకా ఏముంది వెంకాయమ్మా! చెప్పు! చెప్పు!" అంది నారాయణి.

"ఆవిడేమీ చెప్పనక్కర్లేదు. నువ్వు లేముందు. ఇంటికిపోదాం" అంది అనూరాధ చిరాకు పడుతూను.

"నీకంత తొందరైతే నువ్వుపో. నేను కాసేపుండి వస్తాను." అంది నారాయణి.

అనూరాధ తమ్ముణ్ణి తీసుకుని ఇంటికి వెళ్ళిపోయింది.

రాత్రి ఎనిమిదింటివరకూ నారాయణి ఇంటికి రాలేదు. అంతవరకూ ఆమె దేవాలయంలోనే కూర్చుని ఆధారంలేని గాలికబుర్లన్నీ వింటూ అవన్నీ నిజమని నమ్మి మనోరమమీద అణువణువునా ద్వేషం పెంచుకుని గాని ఇంటికి రాలేదు.

ఆమె దారి పొడుగూతా తనలోతానే మనోరమని తిట్టుకుంటూ శాపనార్థాలు కురిపిస్తూ అలిసి, ఇంటికి వచ్చింది. వాకిట్లో ఎదురుచూస్తున్న అనూరాధ తల్లి ముఖంచూసి మాట్లాడకుండా లోపలికి వచ్చేసింది.

"నువ్వు కొంపతీసి ఆమెయింటికి వెళ్ళి దెబ్బలాడలేదుగదా?"

"దానికొంపకు పోవల్సిన అవసరం నాకేముంది? నా కంఠంలో ప్రాణం వుండగా దానితో నేను మాట్లాడేది లేదు."

ఆడవాళ్ళమధ్య అభిప్రాయభేదాలంటూ వుండటానికి పెద్ద కారణాలు అవసరంలేదు. చాలా చిన్న చిన్న విషయాలలోనే వాళ్ళు అమితమైన పట్టుదల పెంచుకుంటారు. ఇందుకు కారణం వాళ్ళ ప్రపంచం చాలా పరిమితమైంది కావటమే. అందువల్లనే వాళ్ళకి సుఖసంతోషాలు, స్పర్థలు, కలిగించే మూల విషయాలు చాలా స్వల్పమైనవిగా, సంకుచితమైనవిగావుంటాయి. భర్త చిన్నగానవ్వితే తన్మయులై జన్మ తరించినట్టు మనసులో అమృతాన్ని నింపుకుంటారు. కేవలం గుమ్మంలో ముగ్గు వెయ్యటందగ్గర ఇరుగు పొరుగు కాపరాలవాళ్ళతో పెద్దపెద్ద ఘర్షణలు పెంచుకుంటారు. నారాయణి ఇంతగా మనోరమ విషయంలో స్పర్ధపూనటానికి బలమైన కారణంఅంటూ

ఏమీ లేదు. కేవలం ఆమె భర్తను వదిలి తమ్ముని పంచని చదువుకోవటమన్నది స్త్రీజాతికంతా కళంకం అని ఆమె అభిప్రాయపడింది. ఆమె ఇటువంటితప్పిదాలని ససేమీ క్షమించలేదు. "భర్తమీద విశ్వాసం సడలించుకున్న స్త్రీకి ఈ ప్రపంచంలో స్థానం లేదు. అందుకు వారు ఇహలోకంలో మాట ఎలాగున్నా పరలోకంలోనైనా భగవంతునిముందు సమాధానం చెప్పాల్సి వుంటుంది. అప్పుడికక లిసివచ్చేదేమీ లేదు." అని ఆమె మనోరమవిషయంలో ఓమారు అంది.

## 9

ఎండలు బాగా ముదిరి కొండలమీదినించి వీచే గాలులు, పొగలూ, సెగలూ కక్కుతున్నాయి. తెల్లవారుఝామున నాలుగింటివరకూ నేల చల్లబడటం లేదు. అవకాశాలు వున్నవారు పట్నం వదిలి చల్లటి దూరస్థప్రాంతాలకు తరలి వెళ్ళిపోతున్నారు. ఉద్యోగస్తులు, కూలీ, నాలీ చేసుకుని బ్రతికేవాళ్ళు మహా యాతన పడుతున్నారు. వడదెబ్బ తగిలి ప్రాణాలు పోయినవారి సంఖ్య అప్పుడే పదికి మించింది. వయస్సు మళ్ళినవాళ్ళు వీధిముఖం చూడటానికి సాహసించటం లేదు. పిల్లలను కటిపడేసినట్టుగా ఇళ్ళల్లోనుంచి బయటికి రానివ్వటం లేదు పెద్దవాళ్ళు. ఇళ్ళు వదిలి ఆఫీసులకు పోయిన మగవాళ్ళు సాయంత్రం ఇంటికి చేరేవరకూ ఆడవాళ్ళ మనసు మనసులో లేకుండా ఆదుర్దా పడుతూంటారు.

విజయవాడలో వేసంగి భీబత్సమైన ఋతువు. తల్చుకుంటే గుండెలు అవిసిపోతాయి...పిల్లలు చదువుకుందుకు రాకపోవటంతో చిన్న చిన్న వీధిబడులన్నీ మూతలుపడ్డాయి.

సరిగా ఇటువంటిదుర్దినాలలోనే వీరభద్రంగారు మంచాన పడ్డారు. నారాయణి అణువణువునా కంపించిపోయింది. ఆమె అన్నగారికి కబురు పంపింది. ఆయన వచ్చారు. చెల్లెలికి ధైర్యం చెప్పి రెండు రోజులుండి మంచి డాక్టర్ను కుదిర్చి ఆయన వెళ్ళిపోయారు. నారాయణి కన్నీరు గ్రుక్కుకుంటూ పెదవులు కదల్చలేక వణుకుతూ డాక్టరుముందు నిలిచి ఏదో అడగబోయింది. ఆయన గ్రహించి "ఫర్వాలేదు. తగ్గిపోతుంది. మీరు ధైర్యంగా వుండాలి" అన్నారు.

ఆమె భర్త మంచం వదిలి ఇవతలికి రావటం లేదు. ఇంటి పనంతా అనూరాధ నెట్టుకొస్తోంది.

వీరభద్రంగారు కళ్లు తెరిచి భార్యతో "క్లబ్బునించి నాకోసం ఎవరైనా వచ్చారా?" అన్నారు.

"లేదు"

"ఇంకా పాతికమందిదాకా చందాలు కట్టవల్సినవాళ్లున్నారు. వాళ్లు కట్టారో లేదో?"

"మీరు ఆ చింత మానండి. ఎవరెలా పోతే మనకెందుకు?"

అనూరాధ తల్లిని భోజనానికి లెమ్మంది.

"నాకు ఆకలిలేదే అమ్మాయ్! నువ్వు తిను"

"నువ్వు ప్రతిరోజూ ఇలాగే అంటున్నావు. అలా వీల్లేదు" అంది అనూరాధ.

"నన్ను బలవంతపెట్టకే. నువ్వు పోయి తిను. తమ్ముడు తిన్నాడా?"

"వాడు తిన్నాడు. నువ్వు తినందే నేనూ భోజనం చెయ్యను".

"పోయి అన్నంతిను. నీ తెలివి బాగానే వుంది. ఉపవాసాలు చేస్తావా?" అంటూ మందలించారు వీరభద్రంగారు.

నారాయణి లేచి భోజనానికి వెళ్ళింది.

ఫర్వాలేదు, వారం రోజుల్లో నయంఅవుతుందనుకున్న జ్వరం నెల్లాళ్ళయినా తగ్గుముఖం పట్టలేదు. మనిషి బాగా నీరసించిపోయారు. చిదకదవడలు పడ్డాయి. మెడకొంకులు బయటపడ్డాయి. మాటకూడా బాగా సన్నగిలిపోయింది.

మందులూ, మాకులూ, మరొకచెంప సంసారమూ, వీటన్నిటికి వచ్చే ఆదా చాలటం లేదు. ముందుగా నారాయణి చేతిగాజులు తాకట్టునుంచి అమ్మకానికి పోయాయి.

నారాయణమ్మ మనసులో నిరంతరం కృశించిన భర్త అస్థిపంజరమే మెదుల్తోంది. దేముడిమీద భక్తి ప్రపత్తులు బాగా పెరిగిపోయాయి. కనిపించిన ప్రతి రాయికీ, చెట్టుకూ ఆమె భర్తఆరోగ్యం గురించి మొక్కింది. ప్రతి రోజూ శివాలయంచుట్టూ ప్రదక్షిణలు చెయ్యటం దినచర్యలో ఓభాగం చేసుకొంది. కాని ఫలితం ఆమె కూడా బాగా నీరసించిపోయింది. అంతకు తప్పించి మరేమీ కనిపించలేదు. వీరభద్రంగారి ఆరోగ్యం వీసమెత్తుకూడా కోలుకోలేదు. ఆయన నానాటికీ కృశించిపోతున్నారు.

రాత్రి ఒంటిగంట కొట్టింది గడియారం. అనూ రాధ నిద్ర మెలకువవచ్చి చూస్తే తల్లి తండ్రిమంచం వార కోడుకు తల ఆనించి కునికిపాట్లు పడుతోంది. తండ్రి గోడకి అంటిపెట్టుకున్న బల్లిలా మంచంమీద నిద్రపోతున్నాడు.

"అమ్మా!"

నారాయణి మెల్లగా కళ్ళు తెరిచి "ఎందు కమ్మా" అంది. గదిలో ఒక మూలగా హరికేన్ లాంతరు మినుకు మినుకు మంటోంది. గాలి ఇంకా వేడిగా వీస్తూంది.

"వేళకి నిద్ర, తిండి వదులుకుంటే ఆరోగ్యం చెడిపోదూ?"

"ఈ పాడుశరీరం అంత త్యాగం చెయ్యగలదా? అన్నం తినకుండా, నిద్రపోకుండా ఎలా వుండగలను. సుష్టుగా తింటున్నాను. తిరుగుతున్నాను. నా గురించి నువ్వు దిగులుపడకు పడుకో" అంది నారాయణి.

అనూరాధ ఇంకేమీ ప్రశ్నించకుండా నారా యణి సౌంజ్ఞతో వారిస్తూ "నువ్వు పడుకో. వారికి మెలకువ వస్తుంది" అంది.

వీథిలో కుక్కలు అరుస్తున్నాయి. నారాయణి లేచి అనూరాధని వెంటబెట్టుకుని వీథిలోకి వెళ్లి వాటిని తోలేసి వచ్చింది.

అనూరాధ నిద్రపోయింది. నారాయణిమటుకు తెల్లవారే వరకూ మెలుకువగానే వుంది. భర్త మెలు కువవచ్చి చూసేసరికి తెల్లవారుఝాము. నారాయణి మంచంవార కూర్చుని వుండటం గమనించాడు.

"నిద్రపోలేదూ?" అన్నారాయన నూతిలోనుంచి మాట్లాడినట్టుగా.

"అబ్బే! ఇప్పుడే లేచాను. పనిమనిషి వచ్చి లేపింది" అని అబద్ధం ఆడింది నారాయణి.

ఇవాళ ప్లీడరు గారివద్ద నుంచి మనిషివచ్చాడు.

నారాయణి అయన్ను కూచోమని "ఎందుకు వచ్చారు?" అంది.

ఆ వచ్చినాయన "ప్లీడరుగారు పంపించారు" అన్నాడు.

"జీతం పంపారా?"

"అవును" అని ఆయన మొలలోంచి అరవై రూపాయలుతీసి అనూరాధచేతి కిచ్చాడు.

"ఆయనకి నా నమస్కారాలు అందజెయ్యండి. ఇంకా వారు పూర్తిగా కోలుకోలేదు." అంది నారాయణి.

"అది సరే. వారు మరోకమాట కూడా చెప్ప మన్నారు" అన్నారాయన సందేహిస్తూను.

"ఏమిటది?"

"ఇప్పటికి మూడు మాసాలనుంచీ వీరభద్రం గారు జబ్బుగావున్నారు. పదిహేను సంవత్సరాలు పని చేయించుకున్న అభిమానంమీద అయ్యగారు ఈ మూడుమాసాలు జీతం ఇవ్వగలిగారు. ఇవాళినుంచీ వారు మరోక గుమాస్తాని కుదుర్చుకున్నారు. ఇక ఈ జీతం..."

"రాదంటారా?" అంది నారాయణి గొంతు పెగుల్చుకుని.

అవునన్నట్లుగా ఆయన తలవూపారు.

"అయితే వుద్యోగం వదులుకోమనే చెప్పారా?"

"అలా చెప్పలేదు. వారి ఆరోగ్యం ఎప్పుడు కుదుటపడితే ఆనాటినుంచీ మళ్ళీ చేర్చుకుంటా మన్నారు. నన్ను ఇలా చెప్పమన్నారు."

నారాయణి పాలిపోయిన ముఖంలో ఏభావాలనో రేఖామాత్రంగా ఆశ పొడసూపింది. అంతమాత్రాన ఈ దెబ్బనించి ఆమె పూర్తిగా కోలుకుందని చెప్ప టానికి వీల్లేదు.

ఆయన వెళ్ళిపోయారు.

నారాయణి అనూరాధని దగ్గరికి రమ్మని పిలచి "ఈ విషయం ఆయనకు తెలియకూడదు సుమా. జాగ్రత్త. ఎవరిదగ్గరా అనకు" అంది.

"ఎవరు వచ్చారు?" అన్నారు లోపల్నించి వీర భద్రంగారు.

"మీకోసం కాదు."

"మూడు మాసాలనుంచీ ఇలా మంచంమీద పడి వున్నానుగదా క్లబ్బునించి ఒక్కముండాకొడుకు చూడటానికి వచ్చాడూ?" అన్నారాయన.

"అవును. వాళ్ళ కెందుకుంటుంది అభిమానం! ఒంట్లో శక్తివున్నన్నాళ్ళూ చాకిరీ చేయించుకున్నారు" అంది అనూరాధ.

రోజులుగడవటం చాలా కష్టంగావుంది. డాక్టరు ఫీజుకయితేనేం మందులకయితేనేం ఈ జబ్బుకింద ఇంతవరకూ రెండు వందలవరకూ అయిపోయింది. కాని గుణంమటుకు అణుమాత్రమైనా కనబట్టంలేదు.

“కొట్టువాడు అరువు ఇవ్వనన్నాడండీ” అంటూ పనిమనిషి వచ్చింది వట్టిచేతుల్తో.

నారాయణి కేమీ పాలుపోలేదు. “పక్కింటి కెళ్ళి ఓ శేరుబియ్యం పట్టుకురా అనూరాధా?” అంది.

కాని అనూరాధ, “నే వెళ్ళను. తమ్ముణ్ణి పంపించు” అనటంతో నారాయణి చిరాకుపడుతూ “అందరికీ అభిమానమైతే నేనువెళ్ళి తెస్తాను” అంటూ బయల్దేరింది. కాని అనూరాధ ఎందుకు వెళ్ళనందో ఆమెకి అర్థం అయింది. ఆమె తనకి అభిమానులు, ఆప్తులు అనుకున్నవాళ్ళంతా ఏవో కారణాలుచెప్పి ఒక్కగింజయినా రాల్చలేదు. చివరికి ఎలాగయితేనేం చాటలో బియ్యంతో ఆమె ఇంటికి వచ్చింది.

వీరభద్రంగారు పదిహేను సంవత్సరాలనుంచీ చేసిన ప్లీడరుగుమాస్తా ఉద్యోగంలో ఆయన వెనక వేసింది దమ్మిడీ లేదు. సాధారణంగా ఆ ఉద్యోగం చేసినవాళ్ళెవరూ మేడలూ మిద్దెలూ కట్టకుండా పోలేదు. జీతం రూపంలో వచ్చేదానికి పైనవచ్చే ఆదాయం ఎంతలేదన్నా రెండు మూడు రెట్లు వుంటుంది. వీరభద్రంగారుకూడా ఈ విషయంలో మడికట్టుకుని కూర్చున్నారనటానికి వీల్లేదు. అయితే వచ్చిందాల్లో మూడువంతులు ఆయన ఖర్చుకే సరిపోయేది. కాఫీహోటలు బిల్లు ముప్ఫయి, రిక్షాలకి, బళ్ళకి, అయే ఖర్చుకింద పాతికా, ఇవికాకుండా సినిమాలు, నాటకాలు, క్లబ్‌లో పేకాటలో పోగొట్టుకొనేదీ, ఇవన్నీ కలిసి ఆయన జీతంలో సగం మింగేవి. ఆ మిగతా సగంమాత్రం ఆయన ఇంటికి తెచ్చి ఇస్తూంటారు. నారాయణి అదేమని అడిగేమనిషి కాదు. ఆ వచ్చినదేదో కటాకటిగా ఇంటిక్రింద సరిపోయేది. కాని ఇలాంటి ఇబ్బందులు వస్తాయనిగాని, పెళ్ళికెదిగిన పిల్ల, పిల్లవాడి చదువు వీటినిగురించి ఆ దంపతులు ఆలోచించలేదంటే ఆశ్చర్యపడవలసిన పనిలేదు. వారి వారి అభిప్రాయాలు, స్వభావాలు అలాంటివి.

నారాయణి ప్రయత్నంమీద గుండె రాయి చేసుకుని తిరుగుతోంది. కాని ఆమె మనసు ఏక్షణాన ఎలా పరిణమిస్తుందో ఎవరూ వూహించటం కష్టం.

ఇంతవరకూ జబ్బేమిటో చెప్పకుండా వైద్యం చేసిన డాక్టరు తనకు కొరుకుబడని ఈ రోగిని వదుల్చుకోవాలనే అభిప్రాయంతో రెండు మూడు రోజుల్నుంచీ రావటం మానేసాడు.

నారాయణి కుర్రవాణ్ణి ఆసుపత్రికి పంపిస్తే ఆయన ఇచ్చిన సమాధానం “మరొక డాక్టర్ని కుదుర్చుకోమని.”

నారాయణి గాభరాపడి ఆనాడే పక్కింటాయనతో చెప్పి మరో డాక్టర్ను ఏర్పాటుచేయించింది. ఆయనవస్తూనే ఇల్లంతా ఓమారు పరిశీలించి ఇంగ్లీషులో “రోగిని అంత ఇరుకుగదిలో కాకుండా ఇలా విశాలమైనచోట పడుకోబెట్టలేకపోయారా?” అన్నాడు. తను చెప్పింది ఇక్కడ ఎవరికీ అర్థంకాలేదని గ్రహించి ఆయనే తెలుగులోకి అనువదించి చెప్పారు.

అనూరాధ వెనకనుంచి తల్లితో “కారువాడు రూపాయి యిమ్మంటున్నాడు” అంది. పక్కింటాయనతో ఈ విషయం చెప్పితే “అలా ఇచ్చుకోవాలమ్మా” అన్నాడాయన.

డాక్టరయితే మారాడుగాని గుణంమటుకు కనబడలేదు.

మళ్ళీ మొదటితారీఖు వచ్చేసరికి నారాయణి మెళ్ళోవున్న ఒక్కగానొక్క ఒంటిపేట బంగారు గొలుసు అమ్మకానికి వెళ్ళిపోయింది. ఇంట్లో చిల్లరమల్లర వెండిసామానంతా ఇదివరకే ఖాళీ చేసేశారు.

## 10

వీరభద్రంగారి జబ్బుతో అనూరాధ వివాహ ప్రసక్తి వెనకబడిపోయింది. అసలా విషయం గురించి ఆలోచించే అవకాశమే ఎవరికీ లేదు. నిత్యం మందులూ, మాకులూ, జ్వరం హెచ్చుతగ్గులూ - ఒక చెంప సంసారంలో ఖర్చులు-ఈవిధమైన విషమ పరిధుల్లో సతమతమవుతున్నారు.

ఇదివరకు ప్రతినిత్యం వచ్చే అమ్మలక్కలెవరూ ఇప్పుడు రావటంలేదు. ఎన్నడూ అనుకోని పరిస్థితులు వచ్చి పడడంతో నారాయణికి వుక్కిరిబిక్కిరిగా వుంది. ఇంతటి ఒత్తిడిలో కూడా నారాయణి పూర్తిగా హతాశురాలు కాలేదు. ఆమెకు ఒక ఆశ అంటూ వుంది. భర్త ఆరోగ్యం కుదుటపడితే ఈసంసారం దివ్యంగా నడుస్తుంది” అనే ఆమె ఆశించింది.

ఇవాళ ఇంట్లో పరిస్థితి అనూరాధకి మనసులో ఏదో ఆవేశం చొప్పించింది. ఆమె వెనకాముందూ చూడకుండానే నేరుగా మనోరమ ఇంటికి వెళ్ళిపోయింది. కాని లోపలికివెళ్ళిం తర్వాత ఆమెలో ఉద్రేకం చప్పగా చల్లారిపోయింది. మనసులో అడగాలనుకున్నది అడగలేక మనోరమ వేసిన ప్రశ్నకు "వూరికేనే వచ్చాను" అంది.

పని మనిషికి అంట్లు వేసి—"ఇవాళ తెల్లవారకుండానే వచ్చావు, ఈ మిత్రురాలిమీద ఇంత దయ కలిగిం దేమిటివిశేషం?" అంది మనోరమ.

కాని అనూరాధ ముఖం ప్రఫుల్లం కాకపోవడంతో ఆమె "అలాగున్నావేం అనూరాధా?" అంది.

"నీకు తెలియదా మనోరమా"

"ఏమిటది?"

"మా నాన్న జబ్బుసంగతి"

మనోరమ చేతిలో పుస్తకం జారవిడిచి "తెలియదే. నువ్వు కనబడి మూడు మాసాలయింది. లేనిపోని అబద్ధాలు చెప్పి స్పర్థలుపుట్టించే ఈఆడవాళ్ళనెవర్నీ నేను చేరదియ్యటం లేదు. వాళ్ళని రావద్దని ఖచ్చితంగా చెప్పేసాను. ఆ తర్వాత మీయింటి విషయాలు నాకు బొత్తిగా తెలియవు." అంది మనోరమ వ్యాకులితమైన కంఠంతో.

"మూడు మాసాలయింది మంచం పట్టి"

"ఆఁ!" అనే ఆశ్చర్యార్థకం తర్వాత మనోరమ మాట్లాడటానికి వ్యవధి తీసుకుంది. "అసలు జబ్బేమిటి? ఇప్పు డెలాగుంది? డాక్టరు సరిగా చూస్తున్నాడా? ఆయ నేమన్నాడు?" అంటూ ఆమె ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపించింది.

"అసలు జబ్బేమిటో ఎవరూ చెప్పటం లేదు. మనిషి బాగా నీరసించిపోయాడు. ఏమీ తోచటం లేదు. ఇంట్లో ఎవరికీ మనసు మనసులో వుండటం లేదు" అంది అనూరాధ.

మనోరమ ఆమెవెన్ను నిమురుతూ "అదే తగ్గుతుంది లే. ధైర్యంగా వుండాలి" అంది.

"అదే ఆశతో మేమూ వున్నాము."

"ఇలాంటి సమయాల్లో మనం ధైర్యం కోల్పోకుండా వుండటం తప్పించి ఏమీ చెయ్యలేము. అలాంటి అనుభవం మా కుటుంబం ఎదుర్కొంది."

అనూరాధ సాభిప్రాయంగా మనోరమ ముఖంలోకి చూసింది.

"మా నాన్నకి జబ్బుచేసింది. నెలల తరబడి తీసుకున్నాడు. భర్తని గౌరవించటంలో, అభిమానించటంలో అమ్మకున్న పట్టుదల, దీక్ష, చాలా ఆశ్చర్యకరంగా వుండేది. చివరికి ఆయనకి బాగా విషమించింది. ఇక బ్రతకరని తోచగానే మా అమ్మ ఆత్మహత్య చేసుకుంది." అని మూడు ముక్కల్లో తేల్చేసింది మనోరమ.

అనూరాధ వళ్ళు జలదరించింది. ఆమె అయోమయంగా "ఎందుకు?" అంది.

భర్తకన్న ఒక్క నిమిషమైనా ముందు చనిపోయి ఐదోతనంతో స్వర్గంలో అడుగు పెట్టాలని ఆమె తరుచు అంటూ వుండేది. ఒకొక్క నమ్మకం మనిషిని ఎంతటి సాహసానికైనా తీసుకెళ్తుంది. అమె పోవటంతో సంసారంలో అనేక చిక్కులు బయల్దేరాయి. ఆ తర్వాత కొద్దిరోజులకే నాన్న చనిపోయాడు. మేమంతా చిన్నపిల్లలం. మా శేఖరం రెండేళ్ళవాడు. వాణ్ణి సాకి పెద్దచేసాను నేను.

"కేవలం మూర్ఖం!" అంది అనూరాధ ముఖం చిట్లించి.

"దాన్ని మనం ఏమని పేరుపెట్టినా పెట్టవచ్చు. కాని ఈ నమ్మకాలను మనం వదిలిపెట్టలేకపోతున్నాం. శ్మశానవైరాగ్యంలాగ ఇలాంటివి విన్నప్పుడూ, కన్నప్పుడూ కాస్త మనసు బెంబేలుపడి కొద్దిసేపు విశాలహృదయులమౌతాం. కాని మరునిముషంలో మామూలుగా అయిపోతాం. దాలిగుంటలో కుక్కలతంతు మనది" అంది మనోరమ.

అనూరాధకు ఇలాంటి విషయాలు అర్థంచేసుకునే అనుభవం లేదు. ఆమె అమాయికంగా "చచ్చిపోవటం అన్నమాట వింటే గుండెలు గుభిల్లుమంటాయి. అలాంటిది ఆత్మహత్య ఎలా చేసుకోగలిగిందమ్మా?" అంది.

"మనదేశంలో తరతరాలుగా పెంచి తమ తమ సంతానాలకికూడా పంచిపెట్టే మహా ప్రసాదం ఈ బానిసత్వం. ఇది స్త్రీ నరనరానికి జీర్ణంచేసుకుని దాన్ని ఘనమైన పేరుతో పిలుచుకుని ఆరాధిస్తూంటుంది. సంసారబాధ్యతలు సమంగా పంచుకుని ఒకర్ని ఒకరు పరస్పరం అభిమానించుకుంటూ, అర్థం

చేసుకుంటూ, సర్దుబాటు చేసుకుంటూ సంసారం నడుపుకోవాలనే వారితో ఏకీభవించేవారిలో నేను మొదటిదాన్ని. అంతేకాదు. చదువుకున్న ప్రతి ఆడదీ విధిగా వుద్యోగం చేసితీరాలనే అభిప్రాయంకూడా నేను వ్యతిరేకిస్తాను. ఇంట్లో వంటచెయ్యటం, పిల్లల్ని సాకటం, ఇల్లు చక్కబెట్టుకోవటం అన్నది ఒక బాధ్యత. ఆఫీసులో వుద్యోగంచేసి సంసారానికి అవసరమైనడబ్బు తీసుకురావటమన్నది మరొక బాధ్యత. ఇందులో మొదటి బాధ్యతకంటె రెండవ బాధ్యత ఘనమైనదని, గౌరవప్రదమైనదనీ భావించే స్త్రీలతో నేను అనేకమార్లు వాదించాను. ఒక బాధ్యతే స్త్రీ నిర్వహిస్తే మరో బాధ్యత పురుషుడు నిర్వహిస్తాడు. ఇందులో హెచ్చుతగ్గులకి స్థానం లేదు. కాని నేను చెప్పేదల్లా స్త్రీ తన ప్రపంచాన్ని మరింత విస్తృతం చేసుకోవాలనే. భర్తని ఆరాధించే ఆడదానికన్న అభిమానించే ఆడదాన్ని నేను ఎక్కువ గౌరవిస్తాను. ఆరాధనలో భావదాస్యం వుంది. అదొక మత్తుమందులాంటిది. ప్రతి స్త్రీ పీడితపడే పరిస్థితులు రాకుండా తన కాళ్ళమీద తను నిలబడగలిగే అర్హత సంపాదించుకోవాలి. అవసరమైతేనే ఆ అర్హత వినియోగించుకోవాలి. అంతేగాని వుద్యోగాలు చెయ్యటమే ఘనమైన గౌరవంగా భావించటం నాకు రుచించదు.

"అయితే నేను చదువుకోలేదుగా" అంది అనూరాధ.

"కాని చదువుకుని వుండాల్సింది. ఈపాటికి చాలావరకూ పూర్తయేది."

"మా అమ్మకి ఇలాంటివంటే గిట్టవని నీకు తెలుసుగా"

"ఆ విషయం నీకంటె బాగా తెలుసు."

తను వచ్చింది ఒకందుకైతే అది వదిలిపెట్టి తక్కినవన్నీ మాట్లాడి అనూరాధ 'నేను వస్తాను' అని లేవబోయింది. అడగాలని ప్రయత్నించింది. నోటి చివరివరకూ వచ్చింది. కాని నోరుతెరచి 'ఓ అర్ధశేరు బియ్యం అప్పుఇవ్వు" అని అడగటానికి ఆమెచేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమయిపోయాయి.

"నేను సాయంత్రం మీ ఇంటికివస్తాను. మీ నాన్నగారిని చూడటానికి," అంది మనోరమ అనూరాధని సాగనంపుతూను.

అనూరాధ చప్పున వెనక్కు తిరిగి మనోరమ రెండుచేతులూ పట్టుకుని "నీకు దణ్ణంపెడతాను మనోరమా! నామాట అపార్థంచేసుకోకుండావుంటే ఒక మాట చెబుతాను" అంది.

"నేను నిన్ను ఎప్పుడు అపార్థంచేసుకున్నాను అనూరాధా! అదేమిటో చెప్పు."

తడబడుతున్న స్వరంతో "నువ్వు మాయింటికి రావద్దు మనోరమా" అంది అనూరాధ.

మనోరమ లిప్తంలో తేరుకుని" అదేమిటి అనూరాధా!" అంది.

"అంతా నీకు తెలుసు మనోరమా. మన పరిచయం ఇలా నిలిచివుండాలంటేమటుకు ఆ పని చెయ్యకు."

"అవును. నాకు తెలుసు. కాని నేను నిగ్రహం గల మనిషిని అనూ."

"అవును ఆవిషయం నాకు తెలుసు. మనోరమా నువ్వు నన్ను మరోకలా భావించవనే అనుకుంటున్నాను. నాపరిస్థితి నీకు తెలుసు. కన్నకూతురుగా తల్లిమీద అభిమానం చంపుకోలేను. కాని ఆమెను నేను సమర్థించనూలేను. నీ స్నేహాన్ని అంతకంటె వదులుకోలేను."

"అది సహజం అనూరాధా. నాకది అర్థం అయింది."

"మరొకమాటకూడా చెప్పాలనుకున్నాను."

"ఏమిటది?"

"మాఅమ్మ కేవలం అజ్ఞానురాలు. ఆమె ధోరణి చాలా దుర్భరంగా, దురన్యాయంగా వుంటుంది. ఎప్పుడయినా ఎదటపడి ఏమైనా అన్నా నువ్వు లక్ష్యపెట్టవద్దని కోరుతున్నాను."

మనోరమ ఆమె భుజంమీద చేతులువేసి "నాకు అన్నీ తెలుసునమ్మా. నువ్వు నిశ్చింతగా వెళ్ళు. కాని మీ నాన్న ఆరోగ్యం గురించి నాకు తరుచుగా తెలుస్తూండాలి. నన్ను రావద్దన్నావు కాబట్టి నువ్వయినా చెప్పిపోవాలి' అని అనూరాధ నాలుగు అడుగులు వేసేవరకూ ఆగి లోపలికి వచ్చేసింది.

అనూరాధ ఇంటికివెళ్ళగానే తల్లి వేసినప్రశ్నకు స్నేహితురాలింటికి వెళ్ళాను అని సమాధానం చెప్పింది.

నారాయణి భర్త గదిలోకి వెళ్ళి మందు కలిపి ఇచ్చి "ఎలాగుంది?" అంది.

వీరభద్రంగారు లోతుకుపోయిన కళ్ళు నిలబెట్టి నీరసంగా మూలిగారు. తల బాధగా అటూ ఇటూ తిప్పారు. లేవబోయి తూలి మంచంమీద పడిపోయారు. నారాయణి చప్పున అదుకుంటూ "ఏం కావాలి? నాతో చెబుతే నేచేయనూ? లేవకండి" అంది.

ఆయనకు ఏదో చెప్పాలని మనసులో వుందిగాని మాట బైటికిరావటం లేదు. అతి నీరసంగా సన్నగా "ఇలాకూర్చో" అన్నారాయన.

జీవితంలో మొదటిసారిగా ఆయన ఈ సంసారం గురించిన ప్రసక్తి తీసుకువచ్చారిప్పుడు. "ఈజబ్బుతో అమ్మాయి గురించి ఆలోచించటానికే వీల్లేకపోయింది. భగవంతుడి దయవల్ల కుదుటపడితే త్వరలో పెళ్ళి చేసెయ్యాలి" అన్నారు.

"దాన్నిగురించి మీరు బాధపడకండి" అయినా దాని వయసెంత? పదహారేగా. ఇంకా కావలసినంత వ్యవధివుంది. నిదానంగా మంచిసంబంధం చూద్దాం. మీరు ఆదిగులు పెట్టుకోవద్దు."

"మరి కట్నానికి డబ్బుకావద్దూ?"

"అదేవస్తుంది. ఆచింత నాకెప్పుడూ లేదు. అన్నిటికి కాలం కలిసిరావాలి."

"పనిచెయ్యకుండా ప్లీడరుగారిదగ్గర జీతం తీసుకోవటం సిగ్గుగావుంది."

దీనికి సమాధానం చెప్పటానికి నారాయణి కొస్త తటపటాయించింది. ఆమె కళ్ళు నీటిపొరలు క్రమ్మటంతో ఆమె ఒకమారు బైటికి వెళ్లి వచ్చి "ఫర్వాలేదు. ఇన్నాళ్లు చాకిరీ చేశారు. ఆపాటి సహాయం చెయ్యటం వాళ్ళ విధ్యుక్తధర్మం" అంది.

"అబ్బాయిని అప్పుడప్పుడు పంపి నా ఆరోగ్యం గురించి వారికి తెలియబరుస్తూండు. లేకుంటే బాగుండదు."

"అలాగే"

ఆ తర్వాత ఆయన భార్య ముఖంవైపు చూసి "నువ్వు పూర్తిగా నిద్రాహారాలు వదిలిపెట్టినట్టున్నావే" అన్నారు.

"అని మీతో అనూరాధ చెప్పిందా?"

"ఎవరూ చెప్పనక్కర్లేదు. నీరూపు చూస్తేనే తెలుస్తోంది. నాకంటే నీరసించిపోయావు."

"ఏమీలేదు. మీకంటికె కలా కనబడుతున్నానంతే. కడుపునిండా తిని కంటినిండా నిద్రపోతున్నాను. దిగులుపడవలసింది మిమ్మల్ని గురించి మేము గాని మాగురించి మీరు కాదు. కళ్లు మూసుకుని పడుకోండి."

అయినా ఆయన ప్రశ్నలు ఆగలేదు. "నేను ఎంత దురదృష్టవంతుణ్ణంటే జీవితంలో కాస్త చేదోడువాదోడుగా వుండే అన్నగాని, తమ్ముడు గాని లేకుండా ఏకాకిగా పెరిగాను. అవునంటావా?"

"నేను వప్పుకోనండీ, ఇప్పుడు మనకి వచ్చిన లోటేముంది?" అంటూ అనూరాధ లోపలికి ప్రవేశించింది.

"అవును. అమ్మాయి చెప్పింది నిజం" అంది నారాయణి.

"తమ్ముడు ఏంచేస్తున్నాడమ్మా. ఓమారు తీసుకురా."

అనూరాధ బైటికివెళ్లి దుమ్ములో ఆడి దుమ్ము కొట్టుకుపోయిన చంద్రుడ్ని పెరటిలోకి తీసుకువెళ్ళి వళ్ళంతా కడిగి మంచి బట్టలు వేసి తండ్రివద్దకు తీసుకెళ్ళింది.

ఆయన వాడ్ని దగ్గరకిరమ్మని సౌంజ్ఞచేసి వాణ్ణి దగ్గర కూర్చోబెట్టుకుని "అక్క చెప్పినట్టు, అమ్మ చెప్పినట్టు వింటున్నావా? అల్లరి చేస్తున్నావా?" అన్నారు.

వాడు లేదని సమాధానం చెప్పాడు.

ఆయన వాడి తలలోకి వేళ్ళు పోనిచ్చి "ఇసకలో దొర్లివచ్చావా? ఇలా తలంతా గరగరలాడుతోందేం." అన్నారు.

నారాయణికి కన్నీరు ఆపుకుందామన్నా ఆగలేదు. భర్త నోటివెంట ఇలాంటి బాధ్యతాయుతమైన మాటలు ఆమె ఈ ఇరవై సంవత్సరాలలోనూ ఇదే ప్రథమంగా వినటం. ఎన్నడూ శ్రమ అన్నది ఎరగని వారు ఏపాటి చిన్నపాటుపడినా ఎదుటవారి సానుభూతి ఏ విధంగా కోరగొంటారో! నారాయణిలో అనిర్వచనీయమైన జాలి, సానుభూతి వీరభద్రంగారు పొందగలిగారు. ఆమెముఖం పక్కకుతిప్పుకుని కన్నీరు తుడుచుకుని అనూరాధ నుద్దేశించి "వాణ్ణి తీసుకుపోయి దుమ్ముదులిపి స్నానం చేయించు" అంది.

వాడు లేవబోతుంటే ఆయన పట్టుకుని "పంతులు దగ్గర చదువుకుంటావా?" అన్నారు.

వాడు తల వూపాడు.

"వీడికి మంచి మాస్టారుని చూసి ఏర్పాటు చేయిండు. చదువుకుంటాడు" అన్నారు భార్యతో.

ఈ మూడు మాసాల్లోనూ ఇంతసేపు మాట్లాడట మన్నది జరగలేదు. ఇవాళ ఆయన వోపిక చేసుకుని మాట్లాడారు.

ఆ సాయంత్రానికి ఆరోగ్యం మరీ క్షీణించి పోయినట్టు డాక్టరు గ్రహించి వెనకనించి నారాయణి అడిగినదానికి నసుగుతూ ఏమీ చెప్పకుండానే వెళ్ళి పోయారు.

## 11

ఆ మర్నాడు తెల్లవారకుండానే ఆ వీథి వాళ్ళంతా హృదయవిదారకమైన ఆక్రందనలు విన్నారు. ఆతృతగా బయటికివచ్చి ఆక్రందన విన వచ్చిన ఇంటివైపు నడిచారు. ఇంటిముందు జనం గుంపులుగా చేరసాగారు.

నారాయణి భర్త శవంమీదపడి తల బాదుకుంటూంది. అనూరాధ తల్లిమీదికి వరిగి జుట్టుపీక్కుని విలపిస్తూంది. నలుగురూ చేరి వారిని ఓదార్చసాగారు. ఎవరి అనునయవాక్యాలూ వారికి దుఃఖోపశమనం కలిగించలేకపోయాయి. మసక చీకటిలో నారాయణి జుట్టు విరబోసుకుని పెద్ద కేకపెట్టి నేలని పడిపోయింది. ఆమె చైతన్యం కోల్పోయింది. అదేమీ అనూరాధ గమనించేస్థితిలో లేదు. ఆమె దుఃఖతీవ్రతలో ఆమె లీనమైపోయింది.

"ఇప్పుడిక మనం చెయ్యగలిగిం దేముందమ్మా. మనసు నిబ్బరంచేసుకోవాలి" అంటూ ఇంటాయన ఓదార్చబోయాడు. కాని ఆ మాటలు వారిరోదనలతో కలిసిపోయాయి. ఆయనే ఆమె అన్నగారిపేర టెలిగ్రాం ఇప్పించాడు.

సూర్యుడు కరకరమంటూ తొంగిచూచాడు. నారాయణి స్మృతితెచ్చుకుని తిరిగి విలపించసాగింది. అనూరాధ అలసి అలసి గొంతు బొంగురుపోయి నిశ్చేష్టురాలై చూస్తూ కూచుండిపోయింది. చంద్రుడు ఆమె ఒడిలో తలపెట్టి నిద్రపోతున్నాడు.

ఉన్నట్టుండి మనోరమ ఆగమనంతో అనూరాధలోని దుఃఖం తిరిగి పైకివచ్చింది. ఆమె రెండుచేతుల్తోనూ ముఖం కప్పుకుని మనోరమ మీదపడి భోరుమని ఏడ్చింది.

ఇలాంటి పరిస్థితుల్లో ఎవరూ ఏమీ చెయ్యలేరు. చెయ్యగలిగిందల్లా ప్రయోజనంలేదని తెలిసికూడా చెప్పినమాటలే చెబుతూ చవకరకం వేదాంతంతో ఓదార్చటంవరకే. మనోరమ అనూరాధని హృదయానికి హత్తుకుని "అమ్మను చూడు అనూరాధా! చిన్నదానివి నువ్వు ధైర్యంగా వుండాలి; అమ్మకు ధైర్యం చెప్పాలి. అంతేగాని నువ్వూ ఇలాగయిపోతే ఎలాగు?" అంది.

అనూరాధ ఏడుస్తూనే "ఇంత ఘోరం జరుగుతుందనుకోలేదు మనోరమా. ఇలానిలువునా మమ్మల్ని నట్టేట ముంచుతాడనుకోలేదమ్మా" అంది.

మనోరమ అలా ఆమెని పొదివిపట్టుకునే మరొకచేత్తో చంద్రుడితల నిమురుతూ కన్నీరు పెట్టుకొంది. ఈశోకపూరిత వాతావరణంలో ఆమె కరిగిపోయింది. ఆమె చెంపలవెంట కారే కన్నీరు అనూరాధ నుదుటిమీద పడగానే అనూరాధ తలెత్తిచూసి మరింత గాఢంగా ఆమెని హత్తుకొంది.

చివరికి శవస్నానాదికాలు ముగిసి పాడె లేచేసమయానికి నారాయణి అన్నగారు బండి దిగారు. ఆయన నేరుగా వచ్చి చెల్లెల్ని హత్తుకుని ఆమెకంటే ఎక్కువగా బావురుమన్నాడు. మరొక్కమారు అందరి గొంతులూ ఉచ్చైస్స్వరంలో ఆక్రందించాయి. ఆ రోదన విన్నవారికి కన్నవారికీ కూడా గుండెలు కరిగిపోయాయి.

అవతల పెద్దలు తొందరచెయ్యసాగారు. నారాయణి దుఃఖంతో శవంమీదనించి లేవటంలేదు. చివరికి బలవంతాన ఆమెను ఇవతలికి లాగింతర్వాత గాని శవాన్ని కదిలించలేకపోయారు.

పొద్దువాటారింది. ఇంకా రెండు మూడు గంటల తతంగం తర్వాతగాని కడుపులో ఆహారంవెయ్యటానికి వీల్లేదు. ఎండ మిటమిటలాడి పోతూంది.

ఎవరు ఎంత ఆక్రోశించినా జరిగేదేమీ లేదు. ఆగేదీ ఏమీ వుండదు.

మనోరమ చొరవతీసుకుని లోపలికివెళ్ళి పొయ్యి రాజేసింది. కాని ఇంట్లో బియ్యం లేవనే సంగతి

ఆమెకు ఆతర్వాత తెలిసింది. అప్పుడామె ఇంటికి వెళ్ళి బియ్యం తీసుకువచ్చి వంటచేసి, పిల్లల్ని బుజ్జగించి, బ్రతిమాలి, నచ్చచెప్పి నాలుగు మెతుకులు తినిపించింది

నారాయణి ఒక్క మెతుకుకూడా ముట్టలేదు. మనోరమ కలగజేసుకుని "మీకు నేను చెప్పవలసిందాన్ని కాను. కాని ఇలా నిరాహారంగా వుండటం బాగుండలేదు" అంది.

"నేను బ్రతికి ఏమిటి సాధించాలి?"

"పరిస్థితిని బట్టి మీరలాగంటున్నారు. ఈ ఇద్దరి పిల్లల గతి ఏమికాను?"

నారాయణి అనూరాధని దగ్గరగా తీసుకుంది.

"వారికోసమైనా మీరు ధైర్యంగా వుండాలి. చిన్నపిల్లలు. మీరు దిగులుతోవుంటే వారూ నీరుకారిపోతారు."

అనూరాధ లేచి పెరటిలోకి వెళ్ళింది.

నారాయణి మనోరమ రెండు పాదాలూ గట్టిగా పట్టుకుని "నేనింతకన్నా ఏమీ చెప్పలేను మనోరమా. నీ రెండు పాదాలూ పట్టుకుని క్షమించమంటున్నాను. ఒకప్పుడు నువ్వన్నమాటలు నాకప్పుడు అర్థంకాలేదు తల్లీ. ఇప్పుడు బాగా బోధపడింది. ఈ ప్రపంచంలో ఎలాంటి పరిస్థితుల్లోనైనా గౌరవంగా బ్రతికే అర్హత నీకుంది. నీకు ఈ ప్రపంచం ఎక్కడో ఒకచోట చోటు చూపిస్తుంది. జీవితం ఎదురు తిరిగి ప్రశ్నించటం అంటే ఏమిటో నాకిప్పుడు అర్థం అయింది. ఇప్పుడు అనుభవమైంది. నీముందు నిజం చెబుతున్నాను మనోరమా. మా సంసారం వీధిని పడింది. నేను తలదాచుకుందుకు జానెడుచోటు లేదు. నా అన్న దరిద్రుడు. వాడే ఒక పూట తింటే ఒక పూట పస్తులు పడుకుంటాడు. పిల్లా జల్లా వున్నవాడు. నా పిల్లలగతేంగాను! చేతిలో దమ్మిడీ లేదు. ఏమి చెయ్యను మనోరమా. నిన్ను అనరాని మాటలన్నాను. కాని దెబ్బతిన్నది నేను. నాకిప్పుడు అంతా అర్థం అయింది మనోరమా. పార్వతమ్మ ఏ స్థితిలో మా యింట అడుగుపెట్టిందో ఇప్పుడు నాకు అర్థంఅయింది" అంటూ ఆమె అక్కడే నేలమీదకు వొరిగిపోయింది.

నారాయణి శిరస్సుమీద చేతులు వుంచి "మీరు మిమ్మల్ని ఇలా తక్కువచేసుకుని ఇంత దీనంగా మాట్లాడటం నాకు బాధగా వుంది. మీకంటె చిన్నదాన్ని నా పాదాలు పట్టుకోవటం అంతకంటె బాధగా వుంది. నేను చెయ్యగలిగిన సహాయం అంతా చేస్తాను. మీరు దిగులుపడకండి" అంది మనోరమ.

"నాది ఒక్కటే ఒక్క కోరికమ్మా."

"అది నేను తీర్చగలనా?"

"అనూరాధని నీకు అప్పచెబుతున్నాను. ఆమెను నీ యింటి..."

మనోరమ అడ్డుపడుతూ "మీ వుద్దేశం నాకు అర్థం అయింది" అంది.

నారాయణి ఆత్రుతగా మనోరమ ముఖంలోకి చూసింది. పాతవన్నీ మర్చిపొమ్మని కోరుతున్నాను."

మనోరమ నారాయణి రెండు చేతులూ పుచ్చుకుని "ఇంతవరకూ నాకలాంటి వుద్దేశం లేదు. ఆ విషయం గురించి ఇప్పుడే ఆలోచిస్తున్నాను" అని ఆమె క్షణం మౌనంవహించి తర్వాత "నా మాట తమ్ముడు కాదనడు. ఆ నమ్మకం నాకుంది. అనూరాధ మా యింట మసలటం మా అదృష్టం. నాకు సమ్మతమేనమ్మా" అంది.

నారాయణి కళ్ళ వెంట అశ్రువులు జలజల రాలాయి.

కాని ఆ తెల్లవారుఝామునే ఎవరితో చెప్పిపెట్టకుండా చేతిలో దమ్మిడీఅయినా లేకుండానే ఆమె యిల్లు విడిచి వెళ్ళిపోయింది.

ఏడ్చి ఏడ్చి మనసు రాయిచేసుకుంది అనూరాధ. వారు ఆమె ఎక్కడ వున్నదీ తెలుసుకోవటంకోసం చేయవలసిందంతా చేసారు. కాని ఆమె జాడ ఎవరికీ తెలియలేదు. ఆమె ఏమయిందో వూహించటం కూడా చాలా కష్టం. పార్వతమ్మ ఏమయిందో ఎవరూ చెప్పలేనట్టే నారాయణి గురించీ అంతే.

"వెళ్ళిపోతూ ఆమె చిన్న చీటీ ముక్కయినా రాసిపోలేదు" అని శేఖరం అన్న మాటకి అనూరాధ అస్మృతి రేకెత్తించిన దుఃఖంతో భర్త వక్షంమీద తల ఆనించి "మా అమ్మకి ఆపాటి భాష రాదు. చదవటం రాదు. రాయటం అంతకంటె రాదు. మీ కీ విషయం తెలియదా?" అంది.